ప్రజాశక్తి
గురువారం 24 నవంబర్ 2022
5
విజయనగరం



25న వికలాంగుల క్రీడాపోటీలు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలోని విభిన్న ప్రతిభావంతుల క్రీడాపోటీలు ఈనెల 25న నిర్వహిస్తున్నట్టు విభిన్నప్రతిభావంతులు, వయోవద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి.వి.బి.జగదీష్ వెల్లడించారు. విభిన్నప్రతిభా వంతుల దినోత్సవం సందర్భంగా స్థానిక రాజీవ్ క్రీడా మైదానంలో 25న ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అంధులు, బధిరులు, చలన సంబంధ, మానసిక విభిన్న ప్రతిభావంతులు తదితర నాలుగు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని, పరుగుపందెం, షాట్‌పుట్, ట్రైసైకిల్ రేస్, సాఫ్ట్‌బాల్, లాంగ్ జంప్, క్యారమ్స్, చెస్, వాలీబాల్ మొదలైన క్రీడల్లో పోటీలు జరుగుతాయన్నారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు 500 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు.

బతికుండగానే చంపేశారు..

బతికుండగానే 232మంది కూలీలను డ్వామా సిబ్బంది రికార్డుల్లో చంపేసిన సంఘటన మెంటాడ మండలం పోరాం గ్రామంలో చోటు చేసుకుంది. అక్రమాలపై నిలదీశారన్న అక్కసో, అడిగేవాడెవడు అన్న అహంకారమో మొత్తానికి వారందరికీ జాబ్‌కార్డులు లేకుండా చేశారు. దీనిపై విచారణ చేపట్టిన అధికారులు సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్, ఎపిఒలను సస్పెండ్ చేసినప్పటికీ కూలీలకు మాత్రం జాబ్‌కార్డులు పునరుద్ధరించలేదు.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

- 232 మంది జాబ్‌కార్డులు రద్దు
- డ్వామా సిబ్బంది నిర్వాకం
- నాలుగు నెలలుగా ఉపాధి కోల్పోయిన కూలీలు
- 6,800 పనిదినాలు, రూ.1.70కోట్ల నష్టం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పోరాం గ్రామంలో 770 మందికి ఉపాధి జాబ్‌కార్డులు ఉన్నాయి. కార్డుదారుల్లో ఎక్కువ మంది కూలీలు ఉపాధి పనులను ఉపయోగించుకుంటూ జీవనం వెల్లదీస్తున్నారు. దాదాపు వంద కుటుంబాలవారికి పూర్తిగా ఈ పనులే జీవనాధారం. జిల్లాలో అత్యధిక పనిదినాలు ఉపయోగించుకుంటున్న గ్రామాల్లో ఇది ఒకటి. ఇటువంటి గ్రామంలో మే మొదటివారంలో వందలాది మంది కూలీల పనిదినాలకు సంబంధించిన పేమెంట్లు అప్‌లోడ్ అవ్వడం లేదని, కంప్యూటర్‌లో వీరంతా చనిపోయినట్టుగా కనిపిస్తోందన్న వార్త తెలుసుకున్న జిల్లా స్థాయి అధికారులు ఆశ్చర్యపోయారు. దీంతో, విచారణ చేపట్టడంతో ఆయా కార్డుదారులంతా బతికే ఉన్నప్పటికీ ఎవరో ఉద్దేశపూర్వకంగా 232మంది పేర్లకు డెత్ అంగ్లపదాన్ని జోడించారని, అందువల్ల పేమెంట్ అప్‌లోడ్ సాధ్యం కాలేదని తేలింది. ఉపాధి పనే జీవనాధారంగా బతుకుతున్న తమకు జాబ్‌కార్డులే లేకుండా చేశారని ఆల్తిపైడమ్మ, బాల, రెడ్డి నారాయణరావు, శంకరరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు నెలలుగా పనిలేక పస్తులుంటున్నామని కునుకు పార్వతీ తదితరులు చెప్తున్నారు. చాలా కాలం క్రితమే మృతి చెందిన ఆల్తి అప్పలనాయుడు పేరున ఉన్న జాబ్‌కార్డుపై ఆయన భార్య, కొడుకు, కోడలు పనులు చేస్తున్నారు. ప్రస్తుతం ఆ కార్డు రద్దు కావడంతో ఆ కుటుంబ సభ్యులకు పనిలేకుండా పోయింది. ఇలాంటి సాంకేతిక సమస్య తలెత్తడంతో వారికి పని కల్పించడం అధికారులకు కూడా సాధ్యం కాలేదు. దీంతో, సుమారు ఆరున్నర నెలలుగా ఉపాధి పనులు లేవు. దీంతో, ఆయా కుటుంబాలవారు ఆర్థిక ఇబ్బందులతో అల్లాడిపోతున్నారు. అప్పటి వరకు పనిచేసిన ఫీల్డ్ అసిస్టెంట్ చింతల కన్నంనాయుడును అనుమానిస్తూ గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. పనిలోకి రానివారికి మస్తర్లు వేసి, వచ్చిన కూలిడబ్బుల్లో ఎక్కువ శాతం వసూలు చేసేవాడని, క్రమంగా కక్కుర్తి ఎక్కువై పనులకు వచ్చినవారి కూలీ సొమ్ములోనూ కొంతకావాలని వేధింపులకు గురిచేసేవాడని, దీంతో, గ్రామంలోని మెజార్టీ కూలీలు ఆయనపై తిరగబడడంతో ఇలాంటి పనికి ఒడిగట్టాడంటూ ఆ గ్రామంలో చర్చ నడుస్తోంది. దీనిపై విచారణ చేపట్టిన అధికారులు ఫీల్డ్ అసిస్టెంట్‌ను విధుల నుంచి తప్పించడంతోపాటు ఎపిఒ హరనాథ్‌ను సస్పెండ్ చేశారు. ఉపాధి కూలీలు మాత్రం సమిధలుగా మిగిలిపోయారు. గ్రామంలో ఇప్పటి వరకు 622మంది 25వేల పనిదినాలను ఉపయోగించుకున్నారు. ప్రస్తుతం జాబ్‌కార్డులు ఇన్ యాక్టివ్ అవ్వడం వల్ల బాధితులంతా 6,800 పని దినాలను కోల్పోయారు. రోజుకు రూ.250 చొప్పున సుమారు రూ.1.70కోట్ల మేర కూలి సొమ్ముకు దూరమైనట్టు స్పష్టమౌతోంది. దీంతో, బాధితులు ఆర్థికంగా అవస్థలు పడుతున్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకున్నాం



పోరాం గ్రామంలో ఉపాధి కార్డులు డెత్ అయినట్టుగా కంప్యూ టర్‌లో చూపించడంపై ప్రాథమిక విచారణ చేపట్టాం. ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదులు అందాయి. రాష్ట్ర కేంద్రంతోపాటు ఎన్ఐసి ఐటి సెల్ అధికారులను కూడా సంప్రదించాం. వారి అభిప్రాయం ప్రకారం మండల కేంద్రంలోనే తప్పిదం జరిగినట్టు అర్థమౌతోంది. అందుకే ఫీల్డ్ అసిస్టెంట్‌తోపాటు ఎపిఒపై కూడా చర్యలు తీసుకున్నాం. వీరు ఇంకా అంగీకరించనందున విచారణ ఇంకా కొనసాగుతోంది. ఉపాధి కార్డుల పునరుద్ధరణకు రాష్ట్ర స్థాయి అధికారుల ద్వారా ప్రయత్నిస్తున్నాం.

జి.ఉమాపరమేశ్వరి , డ్వామా పీడీ

ధాన్యం రైతుల నుంచి ఫిర్యాదుల స్వీకరణకు

కంట్రోల్ రూము ఏర్పాటు



- రైతులు దళారులను ఆశ్రయించొద్దు
- ధాన్యం రవాణా, గోనె సంచుల బాధ్యత ప్రభుత్వానిదే
- కంట్రోల్ రూమ్ నెంబరు 8978975284
- జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో అత్యంత పారదర్శకంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను చేపడుతున్నామని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. ధాన్యాన్ని రైతుల కళ్లాలవద్దే కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. ధాన్యం రవాణా బాధ్యత కూడా ప్రభుత్వానిదేని తెలిపారు. ఈ ప్రక్రియలో రైతుల సమస్యలు పరిష్కరించేందుకు, ఫిర్యాదులను స్వీకరించేందుకు జిల్లా పౌర సరఫరాల సంస్థ కార్యాలయంలో కంట్రోల్ రూమును ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఉదయం 8 గంటలు నుంచి రాత్రి 8 గంటలు వరకు పనిచేసే ఈ కంట్రోల్ రూము నంబరు 8978975284 కు రైతులు సంప్రదించాలని ఒక ప్రకటనలో కోరారు. రైతులకు మద్దతు ధర చెల్లించడానికి జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలు జెసి వివరించారు. వరి సాధారణ రకము క్వింటాలుకు రూ.2040, గ్రేడ్-ఎ రకం రూ.2060గా ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ప్రస్తుత పంట అంచనాలు ప్రకారం, సుమారు 4.46 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని తెలిపారు. ధాన్యం కొనుగోలుకు కావలసిన పరికరాలను ఇప్పటికే అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేశామని తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించాలని కోరారు.

ధాన్యం కొనుగోలు కోసం అవసరమయ్యే గోనెసంచులు, హమాలీలు, ధాన్యం రవాణకు వాహనాలను కూడా ప్రభుత్వమే ఏర్పాటుచేస్తుందని తెలిపారు. ఒకవేలా రైతులే వాటిని భరిస్తే, గోనె సంచికి రూ.3.39పై, రవాణాకు 8 కిలోమీటర్ల వరకు టన్నుకు రూ.295, హమాలీ ఛార్జీలకు క్వింటాకు రూ.25 చొప్పున లెక్కకట్టి, మద్దతు ధరతోపాటుగా నేరుగా రైతుల ఖతాలకే జమచేస్తామని తెలిపారు. ధాన్యం కొనుగోలుకు అవసరమయ్యే గోనె సంచులను జిల్లాలో ఉన్న రైతు భరోసా కేంద్రాలకు సరఫరా చేస్తామన్నారు. ఇప్పటివరకు 3 లక్షల గోనె సంచులను రైతుల సౌకర్యార్థం సరఫరా చెశామని చెప్పారు. రైస్ మిల్లర్ల ద్వారా కూడా గోనె సంచులను సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్‌బికెలు, రైస్ మిల్లుల నిరంతర పర్యవేక్షణ, తనిఖీలు కోసం తహశీల్దార్, ఎంపిడిఒ, ఎంఎఒ, సిఎస్‌డిటిలు, డివిజనల్ కోపరేటివ్ ఆఫీసర్లతో మండల స్థాయి పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేశామని తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రాలకు తరలించాలని జెసి అశోక్ కోరారు.

టూటౌన్ స్టేషన్‌ను పరిశీలించిన ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా ఎస్‌పి ఎం.దీపిక బుధవారం విజయనగరం 2వ పట్టణ పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులు, సిడి ఫైల్స్ తనిఖీ చేసి, స్టేషను పరిసరాలు, లాకప్ గదులను పరిశీలించారు. 102 సిఆర్ పిసి ప్రకారం సీజ్ చేసిన వాహనాలను నిబంధనలు ప్రకారం వేలం వేయాలని సూచించారు. నేరాలపై వచ్చే ఫిర్యాదులపై కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. దర్యాప్తులో ఉన్న కేసుల సంఖ్యను గణనీయంగా తగ్గించుటకు కృషి చేసిన అధికారులను, సిబ్బందిని ఎస్‌పి అభినందించారు. సిఐ సిహెచ్.లక్ష్మణరావు వివిధ కేసుల్లో పురోగతిని ఎస్‌పికి వివరించారు.



వాహనాలను పరిశీలిస్తున్న ఎస్‌పి ఎం.దీపిక

పిల్లల అభ్యసన స్థాయిని బట్టి బోధన : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

తరగతుల్లో పిల్లల అభ్యసనా స్థాయిని బట్టి, బోధనా ప్రణాళికను రూపొందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి చెప్పారు. బడిఈడూ పిల్లలందరూ బడుల్లో ఉండేటట్టుగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పిల్లల అభ్యసనాభివద్ధి కార్యక్రమాలపై, విద్యాశాఖ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్, కమిషనర్ సురేష్‌కుమార్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సూర్యకుమారి మాట్లాడుతూ, జిల్లాలో చేపట్టిన అభ్యసనాభివద్ధి కార్యక్రమాలను వివరించారు. పాఠశాలల్లో 6,7,8 తరగతుల పిల్లలందరూ భాష, గణితం సబ్జెక్టుల్లో కనీస సామర్థ్యాలను సాధించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అన్ని సబ్జెక్టుల్లో కనీస పరిజ్ఞానాన్ని సాధించడానికి అవసరమైన ప్రణాళికను రూపొందించామన్నారు. పిల్లల స్వభావానికి అనుగుణంగా, వ్యక్తిగత బోధన, అభ్యసన ప్రక్రియలను రూపొందిస్తామన్నారు. అభ్యసనలో పిల్లల తల్లితండ్రులను కూడా భాగస్వాములను చేసి, వారి ప్రగతిని ఎప్పటికప్పుడు వివరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సరైన అభ్యసన స్థాయిలు లేక, పాఠాలపై ఆసక్తి లేక బడికి దూరమవుతున్న పిల్లలను గుర్తించి, వారిని తిరిగి రప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. బేస్‌లైన్ పరీక్ష ద్వారా పిల్లల స్థాయిలను గుర్తించి, అందుకు అనుగుణంగా ప్రత్యేక అభ్యసనా పద్ధతులను రూపొందించి, భాష, గణితాల్లో కనీస సామర్థ్యాలను సాధించే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్సులో డిఇఒ లింగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

మనసు పెట్టి పని చేయండి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం



కార్యదర్శుల శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి


సచివాలయ కార్యదర్శులు మనసుపెట్టి పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎ.సూర్య కుమారి సూచించారు. పంచాయతీ రాజ్ చట్టాన్ని అమలు చేయడంలో సచివాలయ సిబ్బంది పాత్ర అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. సచివాలయ వ్యవస్థ మన రాష్ట్రానికే ప్రత్యేకమని, ఈ వ్యవస్థతో గ్రామ స్వరాజ్య స్థాపనను సాధ్యం చేయగలమని అభిప్రాయం వ్యక్తం చేసారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం విజయనగరం డివిజన్‌కు సంబంధించిన సచివాలయ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు ఎపి సేవ- సిటిజెన్ సర్వీసెస్ పోర్టల్ పై శిక్షణా తరగతులు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో వాస్తవ అధికారాలన్నీ సచివాలయ సిబ్బందికి ఉంటాయని, ఈ అధికారం తో గ్రామాల అభివృద్ధి, విశాల ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడే పనులను చేయాలని తెలిపారు. ప్రభుత్వ పథకాలు, గ్రామ ప్రయోజనాలపై ప్రజా ప్రతినిధులకు అవగాహన కలిగించి వారితో కలుపుకొని పనులు చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం పథకంపై దృష్టి పెట్టి నాణ్యమైన భోజనాన్ని అందరికీ అందేలా తనిఖీ చేయాలన్నారు. గ్రామాలకు ఆదాయాన్ని పెంచే మార్గాలను పరిశీలించాలన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. స్పందన వినతులను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వమిత్వ కార్యక్రమంలో గ్రామ కంఠాలకు టైటిల్ ఇచ్చే ప్రక్రియ అత్యంత జాగ్రత్తగా జరపాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఇఒ డాక్టర్ అశోక్ కుమార్, డిపిఒ నిర్మలదేవి, జిల్లా కో ఆర్డినేటర్ అశోక్ కుమార్ తదితరులు శిక్షణ ఇచ్చారు.

ప్రజల్లోకి వెళ్లండి... అవసరాలు తీర్చండి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

'ప్రజలలోకి వెళ్ళండి...వారి అవసరాలు తీర్చండి.. పార్టీ కోసం సమయాన్ని కేటాయించండి' అని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. బుధవారం నగరంలోని కొత్తపేట యాదవ కళ్యాణ మండపంలో జరిగిన 1,2,3,4,12,13, 14 డివిజన్లకు సంబంధించి జోనల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ పటిష్టానికి కార్యకర్తలే వెన్నెముకని అన్నారు. కార్యకర్త స్థాయి నుంచి జెండా పట్టుకున్న నాడే పార్టీకి మనుగడ ఉంటుందని, పటిష్టంగా ఉంటుందని, తగిన గుర్తింపు కూడా ఉంటుందని అన్నారు. అందరి కష్టంతో తాను ఈ స్థాయిలో పదవిలో ఉన్నానని అన్నారు. విజయనగరం నియోజకవర్గంలో టిడిపి తన ఉనికిని చాటుకోవడానికి ప్రతి సోమవారం గ్రీవెన్స్‌కు వెళ్లి వినతి పత్రం ఇవ్వడం పరిపాటిగా మారిందన్నారు. ఫ్లోర్ లీడర్, జోనల్ ఇన్‌ఛార్జి ఎస్‌వివి రాజేష్ మాట్లాడుతూ అందరి సమిష్టి కృషి ఫలితంగానే పార్టీ పటిష్టమవుతుందని అన్నారు. ఈ సందర్భంగా ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన బొంగ భానుమూర్తిని కోలగట్ల వీరభద్ర స్వామి అభినందించారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ ఇసరపు రేవతిదేవి, నాయకులు ముద్దాడ మధు, జోనల్ నాయకులు ముచ్చు శ్రీనివాసరావు, ఇసరపు రామకృష్ణ, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న డిప్యూటీ స్పీకర్

గడప గడపకూ కోలగట్ల

నగరంలోని 16 డివిజన్ చిక్కాల వీధిలో బుధవారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి గడప గడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, ఆసరా, చేయూత వంటి అనేక సంక్షేమ పథకాలు ఏదో రూపంలో తమకు అందుతున్నాయని స్థానికులు తెలిపారు. మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ సమస్యలను విని డిప్యూటీ స్పీకర్ పరిష్కరిస్తున్నారని అన్నారు. కార్పొరేటర్ గుజ్జల నారాయణరావు, డిప్యూటీ మేయర్ రేవతి దేవి, సహాయ కమిషనర్ ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

భూములిచ్చేది లేదు

తేల్చిచెప్పిన పోలవరం ఎడమ కాలువ రైతులు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పోలవరం ఎడమ కాలువ కోసం చేపడుతున్న భూసేకరణలో చిన్న, సన్నకారు రైతులకు చెందిన భూములు పోతుండటం పట్ల రైతులు ఆందోళన చెందుతున్నారు. కాలువ నిర్మాణానికి భూసేకరణ కోసం కొత్తూరు గ్రామంలో బుధవారం ప్రత్యేక ఉప కలెక్టర్ బి.సుదర్శనదొర ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ కొత్తూరు గ్రామ రెవెన్యూలో 300 కుటుంబాలకు చెందిన భూమి పోలవరం ఎడమ కాలువలో పోతుందని, ఆ భూములు పోతే ఆయా కుటుంబాల రైతులకు దిక్కు లేకుండా పోవడమే కాకుండా, గ్రామం వదిలి వెళ్లిపోవాల్సిన పరిస్థితి ఉందని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ప్రాణాలు పోయినా భూములు వదులుకోమని రైతులు, మహిళలు వెల్లడించారు. 70 ఎకరాల భూమి మూడు వందల కుటుంబాలకు చెందినవి అంటే ఎంత చిన్న సన్నకారు రైతులమో ప్రభుత్వాలు మానవతా దక్పథంతో ఆలోచించాలని కోరారు. భూమికి బదులు భూమయినా ఇవ్వండి లేదా డిజైన్ అయినా మార్చండంటూ రైతుల తరుపున ఆ గ్రామ రైతు పొట్నూరు సంతోష్, రైతులు ప్రత్యేక ఉప కలెక్టర్ (భూసేకరణ) బి.సుదర్శన్ దొరకు తెగేసి చెప్పారు. ఇదే విషయాన్ని పై అధికారులు తెలియజేయాలని వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఎస్.కోట తహశీల్దార్ డి.శ్రీనివాసరావు, రెవిన్యూ సిబ్బంది, పోలవరం డిఇ, ఎఇ తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌డిసి సుదర్శనదొర వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

19 నుంచి జగనన్న సాంస్కృతిక సంబరాలు

7,8,9 తేదీల్లో విశాఖలో జోనల్ స్థాయి పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం

డిసెంబరు 19 నుంచి 21 వరకు తిరుపతిలో జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాలు జరగనున్నాయని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్లను తన ఛాంబర్‌లో బుధవారం ఆవిష్కరించారు. ఈ సంబరాల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ముందుగా జోనల్ స్థాయి సాంస్కృతిక పోటీలు జరుగుతాయని తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు సంబంధించి, విశాఖపట్నం ఉడాచిల్డ్రన్ థియేటర్‌లో డిసెంబరు 7,8,9తేదీల్లో పోటీలు జరుగుతాయన్నారు. కూచిపూడి, ఆంధ్ర నాట్యం, భరత నాట్యం, గాత్రం, జానపద కళారూపాలైన డప్పులు, తప్పెటగుళ్లు, గరగలు, చెక్క భజన, పులి వేషాలు, బుట్ట బొమ్మలు, కాళికా వేషాలు, గిరిజన కళారూపాలైన థింసా, కొమ్మకోయ, సవర, లాంబాడీ విభాగాల్లో జోనల్, రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయని చెప్పారు. జిల్లా కళాకారులు ఈ పోటీల్లో పాల్గొని, విజయభావుటా ఎగురవేయాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపాల్ ఆర్‌వి ప్రసన్నకుమారి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

26 నుంచి సీనియర్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 26,27,28 తేదీల్లో మూడురోజులు పాటు విజయనగరం జిల్లా కేంద్రంలో గల రాజీవ్ క్రీడా ప్రాంగణంలో రాష్ట్రస్థాయి సీనియర్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు జరుగుతాయని ఎపి బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డోల మన్మధరావు, బాక్సింగ్‌లో ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు, ఎపి బాక్సింగ్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.నూకరాజు తెలిపారు. ముందుగా బాక్సింగ్ పోటీలు బ్రొచర్ ను వారు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో తొలిసారిగా ఈ పోటీలు జరుగుతున్నాయని తెలిపారు. 13జిల్లా ల నుంచి 13 కేటగిరిల్లో పురుషులు 130 మంది, మహిళలు 40 మంది వరకు పోటీ పడనున్నారని తెలిపారు. 13 రకాల కేటగిరిలో బంగారం, రజతం, కాంస్య పతకాలు అందిస్తామని తెలిపారు. రాష్ట్ర పోటీల్లో విజేతలైన వారిని జాతీయ స్థాయి పోటీలకు పంపుతామన్నారు. ఈ పోటీలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మేయర్, డిప్యూటీ మేయర్ ప్రారంభిస్తారని తెలిపారు. 28న జరిగే ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం జరుగుతుందని తెలిపారు.

ఒత్తిడి లేని విద్యనందించాలి : కేసలి

ప్రజాశక్తి- మెరక ముడిదాం



ఆదర్శ పాఠశాల టీచర్లతో మాట్లాడుతున్న కేసలి అప్పారావు

ఒత్తిడిలేని నైతిక విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు అన్నారు. బుధవారం ఆయన గర్భాం ఆదర్శ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఒక లక్ష్యం దిశగా అడుగులు వేస్తూ అనుకున్నది సాధించాలన్నారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సేవలు, సౌకర్యాలు గురించి ఆరా తీశారు. విద్యార్థుల తరగతి గదులను, భోజన, వసతి గదులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ అరుణతో మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని, క్రీడల పట్ల సమయం కేటాయించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ పరిశీలనలో ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - బాడంగి

రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిఎస్‌పి మోహన్ రావు ఆదేశించారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన భద్రతా చర్యలపై, డ్రంక్ అండ్ డ్రైవ్ పై సమీక్షించారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాదాల బ్లాక్ స్పాట్ ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు, స్టడ్స్, కల్వర్టులు, అండర్ పాస్‌ల వద్ద రేడియం స్టిక్కర్లు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పోలీసు, రవాణాశాఖ పక్కా ప్రణాళికతో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిఐ తిరుమల రావు, ఎస్ఐ ఆర్.జయంతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలిండియా పోటీల్లో సంగీత కళాశాల విద్యార్థుల ప్రతిభ


ప్రజాశక్తి-విజయనగరం

ఆర్ట్ ఆఫ్ లివింగ్ భారతీయ సాంస్కతిక శాఖ ఆన్‌లైన్‌లో నిర్వహించిన సాంస్కృతిక పోటీల్లో స్థానిక మహారాజా సంగీత కళాశాల విద్యార్థులు థింసా నృత్యంలో విజేతలుగా నిలిచారు. జాతీయ పోటీల్లో రెండోస్థానంలో నిలిచిన విద్యార్థులు దక్షిణ భారత దేశం విభాగంలో ప్రతిభ కనబరచి ప్రథమ స్థానంలో నిలిచారు. బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానాచార్యులు గౌరీశ్వరరావు మాట్లాడుతూ జూలై 29 నుంచి ఆగస్టు 15వరకు దేశం మొత్తం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానించారు. కళాశాల నుంచి 15 మంది విద్యార్థులు వివిధ అంశాలైన నృత్యాలు, గాత్రం, జానపద కళారూపాల నుంచి పోటీల్లో పాల్గొన్నారు. థింసా నృత్యంలో సెమీఫైనల్‌కు వచ్చే సరికి ఆన్‌లైన్ ఓటింగ్ ద్వారా రెండో స్థానంలో నిలిచారు. దక్షిణ భారత దేశంలో విజేతలుగా నిలిచారు. వీరు జనవరి 26,27,28 బెంగళూరు జరిగే బహుమతి ప్రదానోత్సవంలో పండిట్ రవిశంకర్ చేతులమీదుగా బహుమతులు అందుకోనున్నారని తెలిపారు.

రహదారి భద్రత నియమాలు పాటించాలి

ప్రజాశక్తి-విజయనగరం

ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలు పాటించాలని రహదారి భద్రతా ఎన్‌జిఒ అధ్యక్షులు మజ్జి అప్పారావు అన్నారు. బుధవారం సీతం ఇంజనీరింగ్ కాలేజీలో రోడ్ సేఫ్టీ అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ళు దాటిన వారంతా చట్టపరంగా మోటార్ వెహికల్ లైసెన్సులను తీసుకోవాలన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీతం కాలేజీ డైరెక్టర్ మజ్జి శశిభూషణ్ రావు మాట్లాడుతూ విద్యార్థులు జాగ్రత్తలు తీసుకొని వాహనాలను నడపాలన్నారు. మోటర్ వెహికల్ ఇనెస్పెక్టర్ రవి శేఖర్, ఆర్‌ఎస్‌ఐ రమేష్ కుమాం, రోడ్ సేఫ్టీ మెడికల్ డాక్టర్ సాయికుమార్, రోడ్ సేఫ్టీ ఎన్జీవోస్ కార్యదర్శి సైలాడ శ్రీహరిబాబు, సభ్యులు ఆర్లె కృష్ణారావు, శ్రీరామ్మూర్తి, విక్రమ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రోడ్డు సేఫ్టీ అధికారులు, ఎన్‌జిఒ సభ్యులు

జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపిక

లక్కవరపుకోట : హైదరాబాద్ ఉప్పల్ బస్టాండ్ సమీపంలో ఉన్న బండి అంజనేయులు గార్డెన్‌లో ఈ నెల 27న జరగనున్న జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎల్‌కోట ప్రాంతం నుండి 10 విద్యార్థులు ఎంపికైనట్టు విశ్వర్ షటోకాన్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీనియర్ కరాటే శిక్షకులు రాజు మాస్టర్ బుధవారం వెల్లడించారు. ఏపీ మోడల్ స్కూల్‌లో చదువుతున్న జి. భరద్వాజ్, పి. వరుణసందీప్, జె. జస్వంత్, బి. రిషేంద్రకుమార్, జె. మనోహర్, జెడ్‌పి హైస్కూల్లో చదువుతున్న జి. జస్వంతచరణ్, బి. ప్రతాపకుమార్, శ్రీ చైతన్య స్కూల్లో చదువుతున్న షేక్ రాషీద్, జార్జ్ టౌన్ పాఠశాలలో చదువుతున్న కె తనిష్, ఎస్‌కోట నారాయణ స్కూల్‌లో చదువుతున్న హేమంత్ తదితరులు ఎంపికైనట్లు ఆయన వివరించారు. రాష్ట్రస్థాయి కరాటే పోటీలలో గెలుపొంది జాతీయస్థాయి కరాటే టోర్నమెంట్‌కు అర్హత సాధించినట్లు చెప్పారు. ఎంపికైన విద్యార్థులు ప్రత్యర్థులతో తలబడి విజయం సాధించాలని పలువురు అభినందించారు.

డప్పు పోటీ విజేతలకు బహుమతులు

వేపాడ : మండలంలోని కొండ గంగుపూడి పంచాయతీలో గిడుగు రామ్మూర్తి మూడో వర్ధంతి సందర్భంగా మండల స్థాయి డప్పు కళాకారుల పోటీలను బుధవారం నిర్వహించారు. ఇందులో విజేతలకు జానపద పీఠం ఆధ్వర్యంలో ప్రశంసా పత్రాలను నిర్వాహకులు అందజేశారు. మొదటి విజేతగా మూలపర్తి రాములు, రెండో విజేతగా పి శ్రీరాములు ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు హాజరై పోటీలను తిలకించారు.

స్పందించిన వ్యవసాయాధికారి

వేపాడ : మండల కేంద్రంలో ఉన్న మండల వ్యవసాయ కేంద్రం ఎప్పుడూ తెరవరా? అనే శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో వెలువడిన కథనానికి మండల వ్యవసాయాధికారి యశ్వంత్ ఫోన్‌లో బుధవారం స్పందించారు. ఆ వ్యవసాయ కేంద్రం శిథిలావస్థకు చేరుకొని కార్యాలయంలో కూర్చోడానికి వీలు లేకుండా పెచ్చులూడిపోవడం, విద్యుత్ సౌకర్యం లేకపోవడం వల్ల తాళం వేసామన్నారు. ఈ విషయాన్ని ఎంపిపి సత్యవంతుడు దృష్టికి తీసుకెళ్లగా నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని చెప్పారని ఎఒ తెలిపారు.

రెండు గ్రామాల్లో పంట కోత ప్రయోగాలు

వేపాడ : మండలంలోని డిఆర్ పేట గ్రామంలో కోన శ్రీనుకు చెందిన రెండెకరాల్లో బుధవారం వ్యవసాయాధికారులు పంటకోత ప్రయోగం చేశారు. నీలకంఠ రాజపురం అగ్రహారం సచివాలయం పరిధిలో పెదగుడిపాలలో కూడా పంట కోత ప్రయోగం చేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ వేణు నాయుడు మాట్లాడుతూ పంట కోత ప్రయోగంలో అధిక దిగుబడులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది దివ్య, ఎన్‌ఏఒ పాల్గొన్నారు.

ఓటు నమోదుపై విద్యార్థులకు అవగాహన

వేపాడ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బుధవారం తహశీల్దార్ ఎస్.కృష్ణంరాజు ఓటు నమోదుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండి ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కాలేజీ ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సి, పాఠశాలను పరిశీలించిన ఎంపిపి


పిహెచ్‌సిలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంపిపి

వేపాడ : మండలంలోని బొద్దాం సచివాలయం పరిధిలో ఉన్న ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని, ప్రభుత్వ పాఠశాలలను ఎంపిపి దొగ్గ సత్యవంతుడు బుధవారం పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి పిహెచ్‌సికి వచ్చిన రోగులకు సక్రమంగా సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి అడప ఈశ్వరరావు, సోంపురం ఎంపిటిసి ఆకుల సత్యనారాయణ, వైసిపి నాయకుడు బొడ్డు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రెండో సెమిస్టర్ పాఠ్యపుస్తకాలు పంపిణీ

బొబ్బిలిరూరల్ : విద్యార్థులకు రెండవ సెమిస్టర్ పాఠ్యపుస్తకాలను నారాయనప్పవలస ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె.సి రాజు మాట్లాడుతు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా ప్రభుత్వం పాఠ్య పుస్తకాలను సరఫరా చేస్తుందని అన్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలో ప్రభుత్వం మొదటి సెమిస్టర్ పాఠ్యపుస్తకాలను సరఫరా చేయగా ఇప్పుడు 6,7,8వ తరగతుల విద్యార్థులకు రెండవ సెమిస్టర్ పాఠ్యపుస్తకాలను సరఫరా చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు సైన్స్ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిఆర్ఇఎ జనరల్ సెక్రటరీగా అప్పారావు


అభినందిస్తున్న తోటి ఉద్యోగులు

బొబ్బిలిరూరల్ : ఎపి పిఆర్ ఇంజినీర్స్ అసోషియేషన్ విజయనగరం జిల్లా జనరల్ సెక్రటరీగా బొబ్బిలి పంచాయతీ రాజ్ ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ సి.హెచ్.వి అప్పారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇతను గతంలోనూ జనరల్ సెక్రటరీగా పని చేశారు. రెండవసారి ఎన్నికవడం పట్ల బొబ్బిలి డివిజన్ ఎఇలు, సిబ్బంది అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికయిన అప్పారావు మాట్లాడుతూ యూనియన్ బలోపేతానికి ప్రతి ఒక్కరం కృషి చేస్తామని, సమస్యలపై మూకుమ్మడి పోరాటం చేసి సాధించుకునే వరకు కృషి చేస్తామని తెలిపారు.

విద్యార్థులకు ఉచిత కంటి తనిఖీలు

బాడంగి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 3 నుండి10వ తరగతి చదువుతున్న 560 మంది విద్యార్థులకు వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ఆప్తాల్మిక్ అసిస్టెంట్ తోట లక్ష్మి బుధవారం తనిఖీలు చేశారు. 25 మందికి కంటి అద్దాలు అవసరమని కొందరికి విటమిన్ లోపాలు ఉన్నాయని గుర్తించి వారికి ఉచిత కళ్ళ అద్దాలు, మందులు పంపిణీ చేస్తామని చెప్పారు. ఆపరేషన్ అవసరం గల వారికి ఉచితంగా చేస్తామని చెప్పారు. కంటి సమస్యలకు ప్రధాన కారణం అదే పనిగా టీవీ, మొబైల్స్ వాడటమేనన్నారు. పిల్లలు విటమిన్ ఏ ఆహార పదార్థాలు తీసుకొని టీవీ మొబైల్స్‌కి దూరంగా ఉంటే ఎటువంటి కంటి సమస్యలూ రావని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ త్రినాదరావు, ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు, ఎస్ఎస్ఎం రమేష్ పాల్గొన్నారు.

'వైసిపిలో గ్రూపులు లేవు'

బొబ్బిలి : బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలో వైసిపిలో రెండు గ్రూపులు లేవని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, వైస్ చైర్మన్ చెలికాని మురళి, కౌన్సిలర్ చోడిగంజి రమేష్ నాయుడు, యువ నాయకులు వాడపల్లి మనోజ్ కుమార్ తెలిపారు. పార్టీ కార్యాలయంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మున్సిపాలిటీలోని వైసిపిలో రెండు గ్రూపులు ఉన్నట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. అందరం ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అడుగుజాడల్లో నడుస్తున్నామని చెప్పారు. వైసిపిలో చీలికలు తేవడానికి తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో కౌన్సిలర్ పాలవలస ఉమశంకర్, నాయకులు దిబ్బ గోపి, సిహెచ్ రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

డెంకాడ : వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అక్కివరం మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సంధ్య అన్నారు. ఆ పాఠశాలలో బుధవారం 9,10 తరగతుల విద్యార్థులకు సమావేశం నిర్వహించారు. నిర్మాణాత్మక మూల్యాంకనం-1లో విద్యార్థులు సాధించిన ఫలితాలపై చర్చించారు. ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఫలితాలు సాధించడానికి రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను వివరించారు. దీనికి తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమన్నారు. విద్యార్థులకు భోజనశాల, సైకిల్ స్టాండ్, ప్రహరీ, సమావేశ మందిరం నిర్మాణానికి తల్లిదండ్రులు ముందుకు రావాలని కోరారు. ఈ సమావేశంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ ముద్దాడ రాము, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

జాకేరులో 104 వైద్య సేవలు

వేపాడ : మండలంలోని జాకేరులో స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి ఎ. ధరణి ఆధ్వర్యంలో 104 ఫ్యామిలీ పిజీషియన్ వైద్య సేవలను బుధవారం అందించారు. ఈ వైద్య సేవలకు హాజరైన వారందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారందరికీ ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌పి హెచ్.ఎస్ గమ్య, హెల్త్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న దుకాణాలు

- షాపుల పేరిట కబ్జా
- చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలానికి చెందిన కొందరు దుకాణాల పేరట లక్కవరపుకోట రెవెన్యూ పరిధిలోగల భూములను ఆక్రమిస్తున్నారు. రెవెన్యూ కార్యాలయానికి కూతవేటు దూరంలో జరుగుతున్న ఈ దందాపై సంబంధిత అధికారులు కన్నెత్తి చూడకపోవడం శోచనీయం. కార్యాలయ సెలవు దినాల్లో, రాత్రి సమయంలోనూ ఈ తరహా ఆక్రమణ పనులు చేపడుతున్నారు. ఈ భూమి ఆక్రమణ వెనుక పాత్ర అధికారులదా.? అధికార పార్టీ నాయకులదా.? తేలీదు గానీ ఆక్రమణదారులు మాత్రం దర్జాగా కబ్జా చేస్తున్నారు.

లక్కవరపుకోట రెవెన్యూ పరిధిలోని భూమి రేట్లు అధికంగా పలకడం వల్ల స్థానికులతో కొందరు భూ కబ్జాకి పాల్పడుతున్నారు. ప్రస్తుత తహశీల్దార్ తామరపల్లి రామకృష్ణ మండల బాధ్యతలు చేపట్టిన తరువాతనే ఈ తరహా భూ కబ్జాలు అధికంగా జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. జ్యూస్, సెలూన్, ద్విచక్ర వాహన మెకానిక్ షెడ్, చికెన్ సెంటర్, ఫ్యాన్ల రిపేరు షాపుల వంటి దుకాణాలు ఈ మధ్య కాలంలోనే కొత్తగా వెలుస్తున్నాయి. ఈ దుకాణాలన్నీ తహశీల్దార్ కార్యాలయానికి కూత వేటు దూరంలో నిర్మించడం శోచనీయం. భూ కబ్జా ఆక్రమణలను అరికట్టి ప్రభుత్వ భూములను పరిరక్షించాలని పలువురు కోరుతున్నారు. ఇందుకు సంబంధించి స్థానిక తహశీల్దార్‌ను వివరణ కోరగా రెవెన్యూ కార్యాలయ సెలవు దినాలలోనూ, రాత్రి సమయంలోనూ ఈ తరహా ఆక్రమణకు పాల్పడుతున్నారన్నారు. ఆక్రమణదారులకు నోటీసులు పంపి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



అక్రమంగా నిర్మిస్తున్న దుకాణాలు


పునాదులు కోసం తవ్విన గోతులు

పాఠశాలకు మోక్షం

వేపాడ : మండలంలోని వీలుపర్తి పంచాయతీ పరిధిలోని పెదగుడాగాడ గిరిజన గ్రామంలో శిథిలావస్థకు చేరుకున్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పునర్నిర్మాణానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. రెండో విడత నాడు నేడు నిధులు సుమారు రూ.35 లక్షల మంజూరు కావడంతో పాఠశాల విద్యా కమిటీ, ప్రధానోపాధ్యాయులు ఎం. నాయుడు ప్రత్యేక శ్రద్ధతో నిర్మాణ పనులను వేగవంతంగా చేయిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే పునాదులు తవ్వించారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి- పూసపాటిరేగ

విద్యారంగ సమస్యల కోసం పోరాడే సంఘం ఎస్ఎఫ్ఐ మాత్రమేనని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పూడి రామ్మోహన్ తెలిపారు. పూసపాటి రేగ ఎస్ఎఫ్ఐ మండల మహాసభ బుధవారం నిర్వహించారు. ముందుగా విద్యార్థులతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి, అనంతరం బ్రిడ్జి జంక్షన్ వద్ద బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల విద్యార్థులకు అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. ఈ సమస్యలను పరిష్కారం చేయడానికి పోరాటమే సరైన మార్గమని అన్నారు. పోరాడే విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ జెండా ఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి విద్యార్థికి గత సంవత్సరం అమ్మఒడి బాకీ పెట్టిందని, జేవిడి నిధులు ఆపేసిందని విమర్శించారు. నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా పాఠశాలలను కలిపేయడం వల్ల డ్రాప్ అవుట్లు విపరీతంగా పెరుగుతున్నాయని, వీటి గురించి ప్రభుత్వం కనీసం ఆలోచించే పరిస్థితి లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కోకన్వీనర్ సిహెచ్ పావని మాట్లాడుతూ దేశంలో స్త్రీలకు రక్షణ లేనట్టే, కళాశాల, పాఠశాలలో బాలికలకు కూడా రక్షణ లేకుండా పోతుందని దుయ్యబట్టారు. అనంతరం 16 మందితో నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. ఎస్ఎఫ్ఐ నూతన మండల అధ్యక్ష కార్యదర్శులుగా భాస్కర్, పైడిలు ఎన్నికయ్యారు. గర్ల్స్ కన్వీనర్‌గా కొండ ఎన్నికయ్యారు. సంపత్, శ్యామల, రమేష్, అప్పన్న ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఎన్నిక కాబడిన నూతన మండల కమిటీకి ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ పక్షాన ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు అరవింద్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి జే రవికుమార్ ఇతర నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ధాన్యం కొనుగోలుపై అవగాహన

డెంకాడ : మండలంలోని ధాన్యం కొనుగోలుపై స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం తహశీల్దార్ పి. ఆదిలక్ష్మి సిబ్బందికి అవగాహన కల్పించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లు, రైతు సహాయకులు, రూట్ ఆఫీసర్లు, కస్టోడియన్ ఆఫీసర్లకు వారి విధివిధానాలు గురించి వివరించారు. ముఖ్యంగా ఈ ఏడాది ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం ఆదేశాల మేరకు మిల్లర్ల పాత్ర ఏ మాత్రం ఉండదని తెలిపారు. సిబ్బందే కొనుగోలు పగడ్బందీగా చేపట్టాలన్నారు. ఈ అవగాహన సదస్సులో ఎఒ పి. నిర్మల, సిఎస్‌డిటి మురళీ, ఇఒపిఆర్‌డి, వ్యవసాయ సహకులు, ధాన్యం కొనుగోలు సిబ్బంది పాల్గొన్నారు.

దత్తిరాజేరు: ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బంది లేకుండా సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపిపి గేదెల సింహాద్రి అప్పలనాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండల ప్రొక్యూర్ కమిటీ ఆధ్వర్యంలో బ్యాగులు, రవాణా, ఈ క్రాఫ్ట్ నమోదు వంటి సమస్యలతో రైతుల అవస్థలు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. రైతు భరోసా కేంద్ర సిబ్బంది ధాన్యంలో తేమశాతాన్ని పక్కాగా ధ్రువీకరించిన అనంతరం మిల్లుకు తరలేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపిపి బమ్మిడి అప్పలనాయుడు, ఎంపిడిఒ సుబ్రహ్మణ్యం, ఎఒ అనురాధ, పలు గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, రైస్ మిల్లుల ప్రతినిధులు పాల్గొన్నారు.


డెంకాడ: సిబ్బందికి సూచనలు చేస్తున్న తహశీల్దార్

గొల్లపేటలో గడప గడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి- కొత్తవలస

మండలంలోని కాటకాపల్లి సచివాలయం పరిధిలో గొల్లపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ప్రభుత్వం నుంచి పథకాలు అందుకుంటున్న లబ్ధిదారుల వివరాలు, ఇంకా అందవలసిన వారి వివరాలను సంబంధిత అధికారులను నుండి అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక పరమైన సమస్యలతో పథకాలు అందని వారిని గుర్తించి తక్షణమే పరిష్కరించి పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మూడేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వైసిపిని ప్రజలకు మరింత చేరువచేయడమే లక్ష్యంగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపడుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రఘురాజు, కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, మండల పార్టీ అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, ఎఎంసి వైస్ చైర్మన్ బొంతల వెంకటరావు, స్టేట్ డైరెక్టర్స్ లెంక రామన్న పాత్రుడు, పిఎస్ఎన్ పాత్రుడు, స్థానిక సర్పంచ్ పీతల కృష్ణ పాల్గొన్నారు.

వంగర: సమస్యలు పరిష్కారానికే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లు అన్నారు. కింజంగి పంచాయతీ ఆర్ఆర్ కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అవినీతికి ఆస్కారం లేకుండా ఎంతో పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉత్తరావల్లి సురేష్ ముఖర్జీ, కరణం సుదర్శనరావు, బొక్కేల వెంకట అప్పలనాయుడు, బొంతు వెంకటరావు, బెజ్జిపురం విజయ్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


బ్రోచర్‌ను మహిళలకు అందిస్తున్న ఎమ్మెల్యే కడుబండి

రోటరీ సేవలు అభినందనీయం

బొబ్బిలి : రోటరీని ప్రజలకు చేరువ చేసి గుర్తింపు తీసుకురావడంలో రోటరీ క్లబ్ ఆఫ్ బొబ్బిలి టైగర్స్ ప్రజలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని పబ్లిక్ ఇమేజ్ జోనల్ కో ఆర్డినేటర్ కిషోర్ కుమార్ అన్నారు. బుధవారం విజయనగరంలోని ఓ హోటల్‌లో రోటరీ పబ్లిక్ ఇమేజ్ ప్రాంతీయ సెమినార్ నిర్వహించారు. సమావేశానికి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలోని రోటరీ క్లబ్ ప్రతినిధులు హాజరయ్యారు. బొబ్బిలి రోటరీ నుండి అధ్యక్షులు జెసి రాజు, అసిస్టెంట్ గవర్నర్ తూముల కార్తిక్, కార్యదర్శి శ్రీహరి, క్లబ్ పబ్లిక్ ఇమేజ్ చైర్ శ్రీనివాసన్ హాజరయ్యారు. సమావేశంలో డిస్ట్రిక్ట్ చైర్ శ్రీ రామ మాట్లాడుతూ రోటరీ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసి ప్రజల్లో మంచి గుర్తింపు తీసుకు రావాలన్నారు. జెసి రాజు మాట్లాడుతూ రోటరీకి మంచి గుర్తింపు వచ్చేలా మరిన్ని మంచి సేవాకార్యక్రమాలను ప్రజలకు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో పిడిజి టిఆర్‌కె జైన్, రామారావు, డిజిఎన్ డాక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ముగ్గురు టిబి రోగుల దత్తత

విజయనగరం : ప్రధానమంత్రి టిబి ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా టిబి వ్యాధికి చికిత్స తీసుకుంటున్న ముగ్గురు చిన్నారులను జిల్లా ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ డాక్టర్ అప్పలరాజు దత్తత తీసుకున్నారు. వారికి పోషకాహారాన్ని అందించేందుకు రూ.12,600 ఆర్థిక సాయాన్ని అందజేశారు. దీనికి సంబంధించిన చెక్కును, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్‌వి రమణకుమారి చేతుల మీదుగా, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ అధికారి రామేశ్వరి ప్రభుకి బుధవారం అందజేశారు.

ప్లాస్టిక్ అమ్మకాలపై ఉక్కు పాదం

ప్రజాశకి- విజయనగరం టౌన్

నగరంలో నిషేధిత ప్లాస్టిక్ అమ్మకాలపై నగరపాలక సంస్థ అధికారులు ఉక్కు పాదం మోపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను విక్రయించే దుకాణదారులపై కొరడా ఝులిపించారు. 8 బృందాలుగా ఏర్పడి నగరమంతా జల్లెడ పట్టారు. ప్లాస్టిక్ విక్రయదారులపై భారీగా జరిమానాలు విధించారు. సరుకులను స్వాధీనం చేసుకున్నారు. కమిషనర్ ఆర్.శ్రీ రాములు నాయుడు ఎనిమిది బృందాలను ఏర్పాటు చేసి, వాటికి నాయకత్వం వహించే బాధ్యతను విభాగాధిపతులకు అప్పగించారు. సచివాలయ సిబ్బంది, పారిశుధ్య పర్యవేక్షకులు, కమిటీ సభ్యులు అందరూ మూకుమ్మడిగా దాడులు నిర్వహించారు. ముందుగా హోల్ సేల్ ప్లాస్టిక్ విక్రయ దుకాణాలపై దాడులు చేపట్టి భారీ ఎత్తులో సరుకును స్వాధీనం చేసుకున్నారు. పండ్లు, పూలు, కూరగాయలు వంటి అమ్ముకుందారులు క్యారీ బ్యాగులు వినియోగిస్తే రూ.500కు తక్కువ కాకుండా జరిమానా వసూలు చేస్తామన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మీడియాతో మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు కఠినంగా వ్యవహరించునున్నట్లు చెప్పారు.

ప్లాస్టిక్ వినియోగంపై తనిఖీలు

నెల్లిమర్ల : నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలో ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా సంబంధిత అధికారులు బుధవారం దుకాణాల్లో తనిఖీలు చేశారు. మొయిద జంక్షన్, జరజాపుపేట ప్రాంతాల్లో ఉన్న దుకాణాల్లో నగర పంచాయతీ కమీషనరు పి.బాలాజీ ప్రసాద్ ఆద్వర్యంలో సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ప్లాస్టిక్ వాడిన షాపుల వద్ద నుండి సుమారుగా 5 కేజిలు ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకుని జరిమానా విధించారు. పాలిథిన్, ప్లాస్టిక్ వస్తువుల వినియోగంతో కలిగే అనార్థాలపై, పట్టణంలో పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్ ప్లేట్లును విక్రయించకుండా నిషేదించాలని అవగాహన కల్పించారు. అనంతరం 5వ వార్డు ఏరియాలలో సందర్శించి, సదరు ప్రాంత ప్రజలకు తడి, పొడి చెత్తను వేరు చేసే విధానంపై ప్లాస్టిక్ వస్తువుల వినియోగంపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి. శ్రీనివాసరావు, శానిటరీ కార్యదర్శులు, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


పార్టీలోకి ఆహ్వానిస్తున్న టిడిపి నాయకులు

ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలి

ప్రజాశక్తి - గుర్ల

ప్రభుత్వ వైఫల్యాలలను ప్రజలకు వివరించి, ప్రభుత్వ పనితీరును ఎండగట్టాలని రాష్ట్ర బిసిసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి వెన్నె సన్యాసి నాయుడు అన్నారు. మంగళవారం రాత్రి చుక్క పేట లో జరిగిన బాదుడే బాదుడు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు చెప్పారు. ఇందులో భాగంగా గ్రామానికి చెందిన కాశి సూర్యనారాయణ కుటుంబంతో పాటు మరో 10 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు చనమల్ల మహేశ్వర రావు, జిల్లా టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి తిరుముల రాజు కిరణ్ కుమార్, ఐ టిడిపి చీపురుపల్లి కోఆర్డినేటర్ నాగులపల్లి నారాయణరావు, పార్టీ నాయకులు మండల అప్పలనాయుడు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సబ్సిడీపై రైతులకు విత్తనాలు

శృంగవరపుకోట: రబీ సీజన్‌కు సంబంధించి మినుములు, పెసర విత్తనాలు సబ్సిడీ మీద రైతులకు అందించేందుకు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి కె రవీంద్ర తెలిపారు. మండలంలోని సంత గౌరమ్మ పేట గ్రామంలో గ్రామ పెద్దలు, రైతులతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఎల్ రవిచంద్ర, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నాగమణి, గ్రామ పెద్దలు రామకృష్ణ, ఈశ్వరరావు, అప్పారావు, దేవుడు, రైతులు పాల్గొన్నారు.

రూ. 20వేలు చెక్కు అందజేత


వేపాడ : బాణాదిలో విశాఖపట్నం పాల ఉత్పత్తిదారుల సంఘంలో పాలు పోస్తున్న రైతు రెడ్డి సింహాద్రి అనారోగ్యంతో మృతి చెందడంతో అతని భార్య రెడ్డి లక్ష్మికి విశాఖ డైరీ పాల సంఘం కేంద్రం2 నుండి రూ. 20వేల చెక్కును పాల సంఘం అధ్యక్షుడు గొంప వెంకటరావు చేతులు మీదుగా బుధవారం అందించారు. ఈ కార్యక్రమంలో పాల సంఘం సూపర్‌వైజర్ నాయుడు, అప్పలనాయుడు పాల్గొన్నారు.


చెక్కును అందిస్తున్న గొంప వెంకటరావు

జీరోటిల్లేజ్ మొక్కజొన్నతో లాభదాయకం

ప్రజాశక్తి- నెల్లిమర్ల

వరి కోసిన తరువాత దున్నకుండా నాటే జీరోటిల్లేజ్ మొక్కజొన్నతో ఎంతో మేలు జరుగుతుందని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ హరిబాబు అన్నారు. ఈ పద్ధతిపట్ల బుధవారం రైతులకు సతివాడలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఎసిఇ ప్రొగ్రామ్ ద్వారా రైతులకు అందించే సేవలను రైతులు వినియోగించుకోవాలని తెలిపారు. అనంతరం రైతులకు వీల్ మార్కర్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపిటిసి సత్యనారాయణ, రైతులు, ఫౌండేషన్ ప్రతినిధులు దేవుడు బాబు పాల్గొన్నారు.



వీల్ మార్కర్‌ను పంపిణీ చేస్తున్న మేనేజర్ హరిబాబు

లారీ ఢీ కొని వ్యక్తి మృతి

రామభద్రపురం : బొబ్బిలి నుంచి విశాఖ ద్విచక్ర వాహనంపై వెళుతున్న వ్యక్తిని రామభద్రపురం చొక్కాపు వాని కల్లాల వద్ద జాతీయ రహదారిలో అదే మార్గంలో వస్తున్న లారీ వెనుక నుంచి బలంగా ఢీకొని కొద్ది దూరం ఈడ్చుకొని పోవడంతో మృతి చెందాడు. ఈ ప్రమాదంలో విశాఖ మధురవాడకు చెందిన మండల వాసుదేవ్(39) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి అతని బ్యాగ్‌లో ఉన్న వివరాలు ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించారు. మృతదేహాన్ని అంబులెన్స్‌లో బాడంగి సిహెచ్‌సికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ సిబ్బందిని అదుపులోకి తీసుకొని వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రమాదం జరగడానికి గల కారణాలు తెలుసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఏఎస్ఐ అప్పారావు తెలిపారు.


అదనపు తరగతి గదుల పనులు పరిశీలన

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణంలోని గొల్లపల్లి వేణు గోపాల మున్సిపల్ హై స్కూల్‌లో నాడు- నేడు ఫేజ్2లో భాగంగా రూ.1.80 లక్షలతో జరుగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావ్యవస్థ మరింత మెరుగుపరిచే విధంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని స్కూల్ ప్రిన్సిపల్‌కు సూచించారు.

కేన్సర్ ఆస్పత్రిలో ఒపిడి బ్లాక్ ప్రారంభం

శృంగవరపుకోట : సత్యసాయిబాబా 97వ జన్మదినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని చినఖండేపల్లి గ్రామంలో శ్రీ సత్యసాయి ట్రస్ట్ ఫర్ యూనివర్సల్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ఏర్పాటవుతున్న కేన్సర్ ఆసుపత్రిలోని సత్య సాయి దివ్యామృతం ఒపిడి బ్లాకును జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం వైసిపి ఇన్‌చార్జి కె.వి.సూర్యనారాయణ రాజు, ఎంపిపి సండి సోమేశ్వరరావు, జెడ్‌పిటిసి ఎమ్.వెంకటలక్ష్మి, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు, స్థానిక సర్పంచ్ సొలుబొంగు దారప్పు, మాజీ సర్పంచ్ సొలుబొంగు కనకం, ఎస్.కోట సర్పంచ్ జి.సంతోషికుమారి, కిల్తంపాలెం సర్పంచ్ సుంకరి ఈశ్వరరావు, పెదఖండేపల్లి సర్పంచ్ యాళ్ళ రమణ, ఎంపిటిసి బోదల దేముడు పాల్గొన్నారు.


ఒపిడి బ్లాక్‌ను ప్రారంభిస్తున్న జెడ్‌పి చైర్మన్